చౌరస్తాల సుందరీకరణకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లు, ఫ్లై ఓవర్ల యూటర్న్‌ల అభివృద్ధి, సుందరీకరణకు రెండు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకి చౌరస్తా, సెవన్ టూంబ్స్ చౌరస్తా, గోల్కొండ కోట చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్, బల్దియా అధికారులతో ఆ కూడళ్లను ఆకర్షణీయంగా తయారు చేసేందుకు అవసరమైన చర్యల గురించి చర్చించారు. గోల్కొండ కోటకు ప్రతినిత్యం దేశవిదేశాల నుంచి ప్రతినిత్యం పర్యాటకులు వస్తుంటారని గోల్కొండ చౌరస్తాను ఆకట్టుకునే విధంగా డిజైన్ చేయాలని ఆయన సూచించారు. టోలిచౌకి వద్ద ఉన్న సాలర్ ఫ్లైఓవర్ పరిసరాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమన్నారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు ఈ చౌరస్తా గుండానే రాకపోకలు జరుగుతాయన్నారు. ఫ్లైఓవర్ పిల్లర్లపై అందమైన రంగు రంగుల బొమ్మలు వేయాలని, యూటర్న్ వద్ద సైత ఆకట్టుకునే విధంగా కళాకృతులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పలు కూడళ్ల వద్ద ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని సెవన్ టూంబ్స్ చౌరస్తా ఇందులో ఒకటని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బల్దియా అధికారులతో పాటు ట్రాఫిక్ ఏసీపీ బి.ధనలక్ష్మి, గోల్కొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్‌రావు తదితరులున్నారు.

మజ్లిస్ సెక్యులర్ పార్టీ..

మజ్లిస్ సెక్యులర్ పార్టీ అని ఈ కారణంగానే మజ్లిస్‌కు ప్రజాదరణ రోజు రోజుకూ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం మల్కాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ఎమ్మెల్యేను టోలిచౌకిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ గ్రామంలోని జయదుర్గామాత ఆలయ అభివృద్ధికి పలువురు అడ్డుకుంటున్నారని ఈ విషయంలో తమకు సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ విషయంలో తన సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయని అన్నారు. కె.శ్రీనివాస్, బి.రమేష్, గన్‌పూర్ మార్కెట్ డైరెక్టర్ యశ్వంత్‌రెడ్డి, శివరాత్రి రవి, అశోక్, కె.అరుణ్ తదితరులున్నారు.

దంతేరస్.. మార్కెట్ జోష్



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఇంటి అలంకరణ వస్తువులను కొంటున్న దృశ్యం



జియాగూడ: ఈ నెల 29న దంతేరస్ దివస్‌ను పురస్కరించుకొని కొనుగోళ్లతో మార్కెట్‌లు కిక్కిరిసి పోతున్నాయి. మంగళవారం దంతేరస్ దివస్ దీపావళి సంబరాలు మొదలవుతాయి. దంతేరస్ వేడుకలకు కావాల్సిన పూజా సామగ్రితో పాటు వ్యాపారాలకు కావాల్సినవి నూతనంగా కొనుగోలు చేసి పూజలు చేస్తారు. దంతేరస్ పూజలతో దీపావళి సంబరాలు ప్రారంభం చేస్తారు. ముఖ్యంగా వ్యాపార దుకాణాలలో లక్ష్మీదేవి ఫొటో ప్రతిష్ఠించి ప్రమిదలు వెలిగించి ఏడాది పొడుగునా నిర్వహించిన వ్యాపార లావాదేవీల లెక్కలు చూస్తారు. అనంతరం హారతులు నిర్వహించి టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెడతారు. 31న దీపావళి సంబరాలు చేపడుతారు. అతిథులను, బంధువులను పిలుచుకొని మిఠాయిలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతారు.

భక్తిశ్రద్ధలతో కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని ఎర్రగుంట కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, అభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగిందని ఆలయ ప్రతినిధి పి.వేణుగోపాల్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పొదుపు సంఘాలతో మహిళలకు మేలు



మహిళలతో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: మహిళా పొదుపు సంఘాల ఏర్పాటుతో మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చునని ఇంటర్నేషనల్ హ్యూమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం టోలిచౌకి అక్బర్ బాగ్‌లోని కార్యాలయంలో ఆయన పలువురు మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వారికి వ్యాపారం చేసుకోవడానికి సరైన సలహాలు, సూచనలు ఇచ్చారు. బల్దియా కార్యాలయ యూసీడీ విభాగం వారు మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తారని ఈ రుణాల ద్వారా మహిళలు ఒక గ్రూప్‌గా ఏర్పడి సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చునన్నారు.

సూర్య ధనుంజయ్‌కు సన్మానం



సుల్తాన్‌బజార్: ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్‌ఇటీవల వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం కులపతిగా బాధ్యత చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ వీసీ చాంబర్‌లో ఆమెనుఘనంగా సన్మానించారు. అనంతరం హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ ధనుంజయ్, ఉస్మానియా యూనివర్సిటీ పీడీఎఫ్ డాక్టర్ రవితే చౌహాన్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సరస్వతమ్మ, నవభారతి నిర్మాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల హేమంత్, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడగ ఉజ్వల్ చందర్ సూర్య ధనుంజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళిని ప్రశాంతంగా జరుపుకోవాలి



మనోజ్ కుమార్, ఏసీపీ

చాంద్రాయణగుట్ట: దీపావళిని ప్రశాంతంగా జరుపుకోవాలని చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్ కుమార్ సూచించారు. టపాకాయలు కాల్చే సమయంలో చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆదివారం ఆయన సాక్షితో వెల్లడించారు. డివిజన్‌లోని చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని క్రాకర్స్ దుకాణదారులకు కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేయడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఏదైనా అత్యవసర సమయంలో 87126 61564 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

ఈ సూచనలు పాటించండి..

- పిల్లలు బాణాసంచాను కాల్చే సమయంలో పెద్దలు వారిని అంటి పెట్టుకొని ఉండాలి.
- బాణసంచా ఎలా కాల్చాలో పిల్లలకు వివరించాలి.
- పెద్ద పెద్ద సామర్థ్యం ఉన్న బాణసంచాకు బదులుగా చిన్నపాటి బాణాసంచాను కాల్చడం అందరికీ మంచింది.
- ప్రమాదం పెద్దదైతే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అంబులెన్స్‌లకు వెంటనే సమాచారం అందించాలి.
- పిల్లల చేతికి పేలుడు వంటి బాణాసంచాను ఇవ్వరాదు.
- వంటిపై వదులైన, వేలాడే దుస్తులను వేసుకోరాదు. కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి.
- ముందు జాగ్రత్త చర్యగా నీళ్లు, ఇసుక తదితర అగ్నిమాపక సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- బాణాసంచాను ఇంట్లో పిల్లలకు దూరంగా, పూర్తి భద్రత కలిగిన ప్రదేశంలో నిల్వచేయాలి.
- కళ్లజోళ్లు, కాళ్లకు చెప్పులు విధిగా ధరించాలి.
- రోడ్లపై, రహదారుల మధ్యలో బాణాసంచా ఉంచి కాల్చరాదు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వెంకటేశ్వర్ రెడ్డి

యాకుత్‌పురా: దీపావళి సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ జి.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 40 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి అనుమతులు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. తమ స్టేషన్ పరిధిలోని లాల్‌దర్వాజా వేంకటేశ్వర స్వామి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, ఛత్రినాక, గౌలిపురా ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నామన్నారు. ప్రజలు టపాసులు కాల్చేటప్పుడు అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తాము సూచించే జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలి



పురస్కార గ్రహీతలతో ఎస్.వేణుగోపాలచారి

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చెన్నారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మెగాసిటీ నవ కళావేదిక, మదర్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, న్యాయవాది డీఎల్.పాండు, సంస్థ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావ్, రాఘవ పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం..అధ్వానం



వార్డు కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తి

గోల్కొండ: గోల్కొండలోని బల్దియా వార్డు కార్యాలయానికి నిర్వహణ లేక అధ్వానంగా మారింది. కార్యాలయ ప్రాంగణం, గదులు, తలుపులు, కిటికీలను చూస్తే ఇది ప్రభుత్వ కార్యాలయమేనా అనే అనుమానం రాకతప్పదు. ఈ కార్యాలయానికి ఉన్న గేటు ఎప్పుడూ తెరిచి ఉంటుంది. సెలవు రోజుల్లో కార్యాలయ ప్రాంగణం ధోబీఘాట్‌గా మారుతుంది. గుర్తు తెలియని వ్యక్తులు సెలవు రోజుల్లో కార్యాలయంలోని అన్ని గదులలో తిరుగుతుంటారు. సాయంత్రం కాగానే మందుబాబులకు అడ్డాగా మారుతోంది. మరో వైపు కార్యాలయంలో ఆటోవాలాలు తిష్ట వేసి ఉంటారు. కార్యాలయంలోని పబ్లిక్ నల్లాతో ఆటోలను కడుగుతుంటారు. గోల్కొండ కోట ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న ఈ కార్యాలయం నిర్వహణను వదిలేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం బల్దియా వార్డు కార్యాలయాలను అత్యాధునికంగా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే గోల్కొండ వార్డు కార్యాలయం మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం, అధికారులు మారినా కార్యాలయ నిర్వహణలో ఎలాంటి మార్పు రాకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: ఇంటర్ జిల్లా రూలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఎల్బీస్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అడిషనల్ సెక్రెటరీ నూర్ మహ్మద్ మాట్లాడుతూ.. యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులును ప్రదానం చేశారు. ఈ వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: ఆలయాల వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్ సూచించారు. ఇటీవల స్టేషన్ పరిధిలోని ఆలయంలో జరిగిన దొంగతనం నేపథ్యంలో ఆదివారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ..దేవాలయ పరిరక్షణ కోసం ఆలయ కమిటీ ప్రతినిధులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే ఛేదించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీసీ కెమెరాల నేరాల నియంత్రణకు ఎంతో దోహదపడుతాయన్నారు. ఇటీవల అల్కా టాకీస్ ప్రాంతంలోని ఆలయంలో దొంగతనానికి యత్నించిన నిందితుదిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

శాస్త్రీయ కళలను కాపాడుకోవాలి



నృత్యగురువు విమలను సన్మానిస్తున్న ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళలను కాపాడుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాక్టర్ వెంపటి చిన్న సత్యం నృత్య సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంపటి చిన్నసత్యం కూతురు కామేశ్వరీ మాట్లాడుతూ.. ప్రాచీన సాంప్రదాయ కళలను నేటి వారసత్వానికి అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు డాక్టర్ విమల నీలం, శిష్యబృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నృత్య గురువు పసుమర్తి వెంకటేశ్వర శర్మ, సినీనటులు జేఎల్ శ్రీనివాస్, స్వాతీ మీనన్, సంస్థ వ్యవస్థాపకురాలు లయన్ లలితా రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సెట్విన్ కార్యక్రమాలపై మంత్రి పొన్నం సమీక్ష

యాకుత్‌పురా: ప్రభుత్వరంగా సెట్విన్ శిక్షణ సంస్థ కార్యక్రమాలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సంస్థ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని సెట్విన్ ఎండీ కే.వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పురానీహవేలిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30లకు నిర్వహించే ఈ సమావేశంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు అందిస్తున్న కోర్సులు, ఇతర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయం



లోక్‌సభ మాజీ స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మిత్ర కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయమని పార్లమెంట్ మాజీ స్పీకర్ మీరాకుమార్ అన్నారు. న్యూఢిల్లీలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు పుస్తకావిష్కరణ సందర్భంగా కార్వాన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మిత్రకృష్ణ ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యమిస్తాం'



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యమిస్తామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇంటి వద్ద ఎక్సైజ్ పోలీసులు, స్థానిక పోలీసులు నిబంధనలు తుంగలో తొక్కి చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గోషామహల్ నియోజకవర్గంలోని ధూల్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, గోషామహల్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను, నాయకులను ఆశీష్‌కుమార్ యాదవ్ వెంట తీసుకువెళ్లి కేటీఆర్ ఇంటి వద్ద పోలీసుల తీరును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడతూ.. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో విద్యాశంకర భారతి స్వామి, కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామి అన్నారు. రవీంద్రభారతిలో సత్కళా భారతి సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భగవద్గీత పఠనం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా భగవద్గీతను చదవాలని సూచించారు. అనంతరం వంద మంది వేద పండితులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, వ్యాపారవేత్తలు ఎస్.రాజమౌళి, పి.వెంకటేశ్వర్లు, సత్కళాభారతి వ్యవస్థాపకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న స్వామి కల్యాణం



వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మనోహర్‌గైక్వాడ్

అబిడ్స్: మంగళ్‌హాట్ గుఫానగర్‌లో మల్లన్న స్వామి ఎల్లమ్మ కల్యాణ వేడుక ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు జోరుగా చేపట్టారు. ఆదివారం ఈ వేడుకలు నిర్వహించి తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుదూ.. ఈ కల్యాణ వేడుకలను నిర్వహించడం ద్వారా శాంతి సామరస్యాలు పెంపొందుతాయన్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌గైక్వాడ్, హెచ్.కుమార్, రవికుమార్, సిద్ధార్‌కామ్లే, భ్యాగేష్ సింగ్, సందీప్ సింగ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అబిడ్స్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. పాతబస్తీలో క్రీడాశాఖ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. రహీంపురాలో జరిగిన లోదేశ్వర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..పాతబస్తీలో క్రీడాకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అండగా ఉండి ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.



క్రీడాకారులతో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరీ సింగ్ తదితరులు

'కోట' కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోటకు ఆదివారం పర్యాటకులు భారీ ఎత్తున తరలివచ్చారు. నగరం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సందర్శకులు వేలాదిగా కోటకు వచ్చారు. ఉదయం నుంచే గోల్కొండ కోట గేటు ముందు టికెట్ల కోసం బారులు తీరారు. మధ్యాహ్నానికి కోటలోని నగీనాబాగ్, రాణిమహల్ ప్రాంగణం, రాణిమహల్ లాన్ ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. విశాలమైన రాణిమహల్ ప్రాంతంలో పర్యాటకులు ఫొటోలు దిగుతూ సంబరపడ్డారు. ఇదిలా ఉండగా కోట ఎదురుగా ఉన్న ఫ్యాన్సీ షాపులు, గిఫ్ట్ షాపులు, రెస్టారెంట్‌లలో ఉదయం 8 నుంచే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మరోవైపు తమకు చేతి నిండా పని దొరికిందని గోల్కొండ కోట హిస్టరీ గైడ్స్ సంబురపడ్డారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ సమర్థ నాయకత్వంతో దేశం అగ్రదేశాల సరసన నిలిచిందన్నారు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో అత్యధిక ప్రజాదరణ పొందుతున్న పార్టీ బీజేపీ ఒక్కటే అని అన్నారు.